PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 61 | శుక్రవారం 12, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

## డీఎస్సీ ఆరోపణలతో వైకాపా

# సెల్ఫ్ గోల్



- సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షునిపై ఆరోపణలు హాస్యాస్పదం
- స్పోర్ట్స్ కోటపై విమర్శలపై క్రీడాకారుల ఆగ్రహం
- వైసిపి హయాంలో నిర్వహించిన క్రీడలకు కూటమి హయంలో ఉద్యోగాలు
- వైసిపి ప్రభుత్వంలో సర్టిఫికెట్లు,కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాలు
- మరి ఫేక్ ఉద్యోగాలు అంటే సర్టిఫికెట్లు ఇచ్చిన ప్రభుత్వాన్ని ఏం చేయాలి
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న క్రీడాకారులు





ఏపీ బ్యూరో (ప్రజా సీమ) ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హయాంలో ఇచ్చిన డీఎస్సీ స్పోర్ట్స్ కోట ఉద్యోగాలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైకాపా నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సెల్ఫ్ గోల్ వేసుకునేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోట పొందిన చాలా మంది తమ సర్టిఫికెట్లను 2019 నుండి 2024 మధ్య పొందినవారే. అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ హయాంలో గత ఐదేళ్లలో జరిగిన అనేక క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు అధిక శాతం డీఎస్సీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకొని ఉద్యోగాలు సంపాదించుకున్నారు. అంటే వైసిపి హయాంలో ఇచ్చిన సర్టిఫికెట్లకు కూటమి హయాంలో ఉద్యోగాలు ఇచ్చారన్నమాట. మరి డీఎస్సీలో క్రీడా ఉద్యోగాలు అమ్ముకున్నారనే వైసిపి ఆరోపణలను ఏ విధంగా తీసుకోవాలో ప్రస్తుతం అర్థం కాని పరిస్థితి. దీనికి తోడు వైసిపి వారు ఆరోపిస్తున్నట్లు కొందరు అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని వైసిపి నాయకుల వద్దకు వెళ్లిన విషయంపై అధికారులు కూడా సాక్షాధారాలతో నిరూపించారు.

**సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షునిపై ఆరోపణలు హాస్యాస్పదం**

ముఖ్యంగా డీఎస్సీ రాజకీయ రంగు పులుముకోవడంతో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిన కూన రవికుమార్ పై వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా మారింది. ఎందుకంటే డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో సాఫ్ట్ బాల్ క్రీడాకారులు ఉద్యోగాలు సంపాదించారని, అందుకు కూన రవికుమార్ అధ్యక్షుడిగా ఉండడమే కారణమని వైసిపి చేస్తున్న ఆరోపణలు. అయితే ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా కూన రవికుమార్ 2025 వ సంవత్సరంలో ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికైన తర్వాత జరిగిన క్రీడా పోటీలకు సంబంధించి డీఎస్సీలో ఎటువంటి ఉద్యోగాలు పొందిన దాఖలాలు లేవు. కేవలం వైసీపీ హయాంలోని 2019 నుండి 2024 వరకు దాదాపు ఐదేళ్లు ఆంధ్రప్రదేశ్ జట్టు వివిధ విభాగాలలో సాధించిన విజయాల సర్టిఫికెట్లను మాత్రమే ఆధారంగా చేసుకుని డీఎస్సీలో సాఫ్ట్ బాల్ క్రీడాకారులు ఉద్యోగాలు సంపాదించారు. మరి డీఎస్సీలో సాఫ్ట్ బాల్ క్రీడాకారులు ఉద్యోగాలు సంపాదించడానికి అధ్యక్షునిగా 2025వ సంవత్సరంలో ఎన్నికైన కూన రవికుమార్ కి ఏమి సంబంధం ఉ ందో వైసీపీ నాయకులకే తెలియాలి.కూన రవికుమార్ పై ఆరోపణలు రావడానికి ప్రధాన కారణం ఆయన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కావడం, తెలుగుదేశం పార్టీలో ఫైర్ బ్రాండ్ గా ఉండడం, రాష్ట్రంలోనే తెలుగుదేశంలో కీలక నేతగా ఉండడంతో ఆడలేక మద్దెల మీద పడ్డట్టు ఆయనకు సంబంధం లేని ఆయన హయాంలో జరగని విషయాలను అంటగట్టి ఆరోపణలు చేయడం తప్ప వైసీపీ సాధించింది ఏమీ లేదు. ఎందుకంటే డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడం ప్రతిపక్ష పార్టీగా వైసీపీకి పూర్తి హక్కు ఉన్న, వారి ఆరోపణలకు అధికారులు స్పష్టమైన ఆధారాలతో సమాధానం ఇచ్చారు. మరి 2019 నుండి2024 మధ్య సాఫ్ట్బాల్ క్రీడలో అనేక టోర్నమెంట్లలో గొప్పగా రాణించిన ఆంధ్రప్రదేశ్ జట్టు లోని చాలామంది సభ్యులు డీఎస్సీలో ఉద్యోగాలు సంపాదిస్తే వారిని నకిలీగా చిత్రీకరిస్తున్నారు అంటే మరి ఐదేళ్లలో వారికి సహకరించిన ప్రభుత్వం నకిలీ క్రీడాకారులను, నకిలీ సర్టిఫికెట్లను ప్రోత్సహించిందా అనే అనుమానాలు కలగక మానవు.

**వైసిపి హయాంలో సాఫ్ట్ బాల్ క్రీడలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలు**

2018-19 సంవత్సరంలో సాఫ్ట్బాల్ సౌత్ జోన్ ఆంధ్ర ప్రదేశ్ జట్టు మొదటి స్థానం,

ఫెడరేషన్ కప్ రెండో స్థానం, ఇంటర్ జోన్ మొదటి స్థానం ,

2019- 20 సంవత్సరంలో సౌత్ జోన్ మొదటి స్థానం,

2021- 22 సౌత్ జోన్ మొదటి స్థానం, ఇంటర్ జోన్ మొదటి స్థానం, సీనియర్ నేషనల్ రెండో స్థానం ,

2021- 22 నేషనల్ గేమ్స్ గుజరాత్ అహ్మదాబాద్ లో జరిగినటువంటి టోర్నమెంట్లో తృతీయ స్థానం ఆంధ్రప్రదేశ్

2 లో





## రైల్వే కోడూరులో

# భూ భకాసురులు

**దొరికితే దోచేస్తాం, ఖాళీగా కనిపిస్తే దున్నేస్తాం మమ్మల్ని అడిగే వారెవరు, ఎవరికి ఫిర్యాదు చేసినా ఎవరు ఫిర్యాదు చేసిన వారి సమాచారం మాకు వెంటనే అందుతుంది. అధికారం మాది అధికారులు మావారే అంతా నా ఇష్టం అంటూ రైల్వేకోడూరులో కబ్జా రాయుళ్ళు రెచ్చిపోతున్నారు. విలువైన ఖాళీ స్థలాలు ఎక్కడ దొరికితే అక్కడ చదును చేయడం, రాత్రికి రాత్రి కంచి వేయడం, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారుల ద్వారా వారి సమాచారం తెలుసుకొని బెదిరించడం చూస్తుంటే భూకబ్జాలకు నిలయంగా రైల్వే కోడూరు మారిందని స్పష్టంగా అర్థమవుతుంది. ఇదే విషయంపై ఎవరైనా అధికారులు అడిగితే వారి వద్ద నుండి వచ్చే సమాధానం ఏమో సార్ మాకు తెలియదు అంటున్నారు.**

- ఖాళీగా కనిపిస్తే దున్నేస్తాం
- కబ్జాలకు అడ్డాగా రైల్వే కోడూరు
- ఏమో సార్ మాకు తెలియదు అంటున్న అధికారులు
- కొత్త వరవడికి శ్రీకారం చుట్టిన రెవెన్యూ శాఖ
- కోట్ల రూపాయల భూములు హాంఫట్
- సమాచార శాఖ అధికారులుగా మారిన రెవెన్యూ శాఖ
- ఫిర్యాదు చేస్తే కబ్జాదారులకు సమాచారం చేరవేత




రైల్వే కోడూరు, ప్రజాసీమ: ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే ప్రేక్షకులుగా తయారై దోచుకుంటూ దోపిడీ చేస్తున్న వారికి జీ హుజూర్ అంటూ సలాం కొడితే ఇంకా వారికి అడ్డు అదుపు ఏముంటుంది. అలాంటి పరిస్థితి రైల్వేకోడూరులో నెలకొని ఉంది. ప్రస్తుతం రైల్వే కోడూరు లో కోట్ల రూపాయలు విలువ చేసే భూములను బహిరంగంగానే చదును చేస్తూ ఆక్రమించుకుంటుంటే వాటిని కాపాడాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. రైల్వే కోడూరు పట్టణం లో బైపాస్ రోడ్డు సాయిబాబా ఆలయం సమీపంలో ఎంతో విలువైన భూమిని కొందరు నాయకులు దర్జాగా చదును చేసి కాజేసేందుకు సిద్ధమవుతుంటే స్పందించాల్సిన అధికారులు ఏమో సార్ మాకు తెలియదు అంటూ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా అధికారులు అధికార పార్టీ నాయకులకు సహకరించడం సహజం. మరి ప్రభుత్వ భూములను, స్థలాలను ఆక్రమించుకుంటున్న స్పందించని అధికారుల తీరు చూస్తుంటే మరి దీని వెనక ఎవరున్నారు అనేది స్పష్టంగా అర్థం అవుతుంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో కూటమి నాయకుల సంపూర్ణ సహకారంతోనే ఈ వ్యవహారం నడుస్తుందని కోడూరు కోడైకూస్తున్న మరి ఆ కోడి కూత రెవెన్యూ అధికారులకు వినిపించకపోవడం చూస్తుంటే మరి అధికారులు కావాలని వినడం లేదు లేక వినిపించినా వినిపించినట్టు నటిస్తున్నారో అర్థం కాని పరిస్థితిల రైల్వే కోడూరులో వ్యవహారం

2 లో

# ఆర్.ఎం.పి వైద్యశాలలను తనిఖీ చేసిన డాక్టర్ భావన



ఒంటిమిట్ట,(ప్రజా సీమ):జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డాక్టర్ నాగరాజు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఆర్.ఎం.పి, ప్రైవేట్ వైద్యాశాలల గుర్తింపు మరియు వారి చికిత్సా విధానాల తనిఖీ లొ భాగంగా గురువారం ఒంటిమిట్ట ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆర్.ఎం.పి వైద్యశాలలను ఒంటిమిట్ట ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భావన తనిఖీ చేసి నివేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారికి సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు భాస్కర్ రెడ్డి,సుజాత మగ ఆరోగ్య కార్యకర్త వెంకటసుబ్బయ్య, ,స్త్రీ ఆరోగ్య కార్యకర్త నాగభూషణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

# ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభకు బయలుదేరుదాం

## -కూటమి శ్రేణులకు ముక్కా రూపానంద రెడ్డి, ఆరవ శ్రీధర్ ముక్కాసాయి వికాస్ రెడ్డి

రైల్వే కోడూరు (ప్రజాసీమ )రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మరియు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము,కావున రేపు అనగా 12-06-2026 (శుక్రవారం) ఉదయం 8:00 గంటలకు శెట్టిగుంట ఎస్ ఎల్ ఎన్ హోమ్స్ ఎదురుగాకార్ల ర్యాలీ ప్రారంభమై సభా ప్రాంగణానికి బయలుదేరనుంది. ఈ సందర్భంగా అందరికి ఉదయం 7:00 అల్పాహార విందు ఏర్పాటు చేయబడిందని.




ఈ సందర్భంగా కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు అభిమానులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయవంతం చేయవలసిందిగా ఒక ప్రకటలో కోరారు.

# మంత్రి కొల్లు రవీంద్రని మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణ ఆచారి



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పర్యటనకు విచ్చేసిన భూగర్భ గనులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు టిడిపి జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు,ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా,జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తదితరులతోపాటు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా మంత్రి రామకృష్ణ ఆచారిని అప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ గనులు,ఎక్సైజ్ శాఖ మంత్రిగా కొల్లు రవీంద్ర సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్ర ఖజానాకు ఆదాయ పెంచుతున్నారన్నారు.బీసీ సామాజిక వర్గంలో బలమైన నేతగా ఎదిగి పార్టీ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్ బాబుల వద్ద ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియా డారు.ఆయనను కలుసుకోవడం తనకి ఎప్పుడూ ప్రత్యేకమేనన్నారు.

# మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి గ్రూపు పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సురెన్స్ చెక్కును అందజేసిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్

ఒంగోలు, జూన్ 11 : ఆక్సిడెంట్ లో మృతి చెందిన బాధిత పోలీస్ కుటుంబానికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ చెక్కును గురువారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయం లో జిల్లా ఎస్పీ అందచేసినారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు తేది 28.03.2026 న మృతి చెందిన కీర్తి శేషులు జె.వెంకట రమణయ్య, ఎజ.453 గారి సతీమణి జె. శ్రీలక్ష్మికి రూ. 20,65,000/- చెక్కును అందచేసినారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ రోజు అందజేసిన ఆర్థిక సహాయం ద్వారా కుటుంబానికి కొంత భరోసా కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు శాఖ పరంగా అందాల్సిన ఇతర ప్రయోజనాలు కూడా త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతి చెందిన సిబ్బంది కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఏదైనా సమస్య ఉన్న నేరుగా తనను కలవవచ్చునని వారి కుటుంబ సభ్యులకు జిల్ల ఎస్పీ గారు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ాూా రామ్మోహన్ రావు, డిపిఓ పి.సూపరింటెండెంట్ యాస్మిన్ భాను, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ మేనేజర్ ాఎ సుబ్బారావు, డీపీఓ సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

# డీఎస్సీ ఆరోపణలతో వైకాపా సెల్ఫ్ గోల్

జట్టు కైవసం చేసుకుంది.


2022- 23లో ఒడిస్సా రాష్ట్రంలో జరిగినటువంటి సాఫ్ట్బాల్ సీనియర్ నేషనల్ లో ఆంధ్రప్రదేశ్ జట్టు మొదటి స్థానం, 2023- 24 లో సౌత్ జోన్ మొదటి స్థానం ఇంటర్ జోన్ మొదటి స్థానం. ఇవి కేవలం వైసీపీ హయాంలో సాఫ్ట్ బాల్ లో ఆంధ్రప్రదేశ్ జట్టు సాధించిన విజయాలు. దాదాపు మెజార్టీ అభ్యర్థులు ఈ సర్టిఫికెట్లను ఆధారంగా చేసుకుని డీఎస్సీలో ఉద్యోగాలు సంపాదించారు. మరి వైసిపి హయాంలో సాఫ్ట్బాల్ క్రీడా జట్టును గుజరాత్ లో సాధించిన అద్భుత విజయానికి ప్రభుత్వం అభినందించి, వారిని విజయవాడలో సత్కరించి వారికి ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల నజరానా అని కూడా అందించింది. అలా నజరానా పొందిన వారిలో ఇప్పుడు డీఎస్సీలో ఉద్యోగాలు సంపాదించిన వారు కూడా ఉన్నారు. మరి డీఎస్సీలో సాఫ్ట్ బాల్ క్రీడలకు సంబంధించి అవకతవకలు జరిగి ఉంటే, సర్టిఫికెట్లు నకిలీవి అయితే మరి అందుకు ప్రధాన బాధ్యత మాత్రం వైసీపీ ది అప్పటి ప్రభుత్వంలో ఉన్న క్రీడా శాఖ దే. అంతేకానీ కేవలం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, క్రీడలకు అత్యంత ప్రాముఖ్యత ఉన్న శ్రీకాకుళంలో పుట్టిన నాయకునిగా క్రీడలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ముఖ్యంగా సాఫ్ట్ బాల్ కు ప్రత్యేక గుర్తింపు తేవాలని కృషి చేస్తున్న కూన రవికుమార్ లాంటి వ్యక్తులపై కేవలం రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేస్తే మాత్రం వైసీపీ సెల్ఫ్ గోల్ వేసుకున్నట్లే. కోసమెరుపు ఏమిటంటే ఇలా అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదు చేసింది కూడా ఒక సాఫ్ట్బాల్ క్రీడా కారుడే అనేది గుర్తుంచుకోవాలి.

# వడ్డెర సంఘం మదనపల్లి పట్టణ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

## - అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఇడగొట్టి రెడ్డి శేఖర్,పల్లపు రమేష్

## - నూతన కమీటిని ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా







మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణ వడ్డెర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.గురువారం బైపాస్ రోడ్డులోని పిపిఆర్ ఫంక్షన్ హాల్ నందు వడ్డెరల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది.ఈ సమావేశానికి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఇందులో భాగంగా వడ్డెర సంఘం మదనపల్లి పట్టణ అధ్యక్షుడిగా ఇడగొట్టి రెడ్డి శేఖర్ (డ్యాన్స్ రెడ్డెప్ప),ప్రధాన కార్యదర్శిగా పల్లపు రమేష్, కోశాధికారిగా డేరంగుల గుణ భూషణ,గౌరవాధ్యక్షులుగా ఆలకుంట శ్రీనివాసులు,గౌరవ సలహాదారులుగా జరిపిటి రెడ్డెప్ప,ఇడగొట్టి చంద్రశేఖర్,బత్తుల నారాయణతోపాటు ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న వారసులుగా గుర్తింపు పొందిన వడ్డెర కులస్తులు స్వతంత్ర పోరాటంలో సైతం క్రియాశీలకంగా పాల్గొన్నట్లు చరిత్రలు చెబుతున్నాయని.భవన నిర్మాణంలో వడ్డెర్ల కీలక పాత్ర పోషిస్తున్నారని,వారి నైపుణ్యానికి నిదర్శనంగా ఎన్నో భవనాలు వెలుస్తున్నాయని ప్రశంసించారు.వడ్డెర్ల అభివృద్ధి,సంక్షేమానికి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని,వడ్డెర్ల భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.అనంతరం అధ్యక్షుడు ఇడగొట్టి రెడ్డి శేఖర్ (డ్యాన్స్ రెడ్డెప్ప) మాట్లాడుతూ వడ్డెర సంఘం పట్టణ అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని,కుల పెద్దలతో కలిసి వడ్డెరల సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతో నియోజకవర్గంలో వడ్డెరలు అన్నిరంగాల్లో ముందంజ వేయాలని ఆకాంక్షించారు.ఇందులో భాగంగా నూతన కమిటీని ఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బండి ఆనంద్,దేవరింటి శ్రీనివాసులు,చల్లా నరసింహులు,డేరంగులు శ్రీనివాసులు,ఉపాధ్యాయులు శ్రీనివాసులు,చంద్రయ్య, సాంబశివ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు,బత్తుల చలపతి,ఇడగొట్టి సుధాకర్,ప్రభాకర్ మరియు వడ్డెర కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమ సంఘంలోకి

# 30 కుటుంబాల చేరిక

## -జై భీమ్ నినాదాలతో మారుమోగిన సాయినాథపురం

మైదుకూరు జూన్ 11 ప్రజా సీమ : వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు పుర పాలక సంఘం పరిధిలోని సాయినాథపురం కొత్తకొట్టలు గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తున్న ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు విలియమ్ కలమలమిట్ట ఆధ్వర్యంలో గురువారం సుమారు 30 కుటుంబాలు సంఘంలో చేరాయి. ఈ సందర్భంగా విలియమ్ కలమలమిట్ట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సంఘంలో చేరిన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ, కొత్తకొట్టాలులో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపైన, మౌలిక వసతుల సాధన కోసం తాము అలుపెరగని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అలాగే అక్కడ నివాసం ఉంటున్న నిరుపేద ప్రజలకు తప్పకుండా ప్రభుత్వ ఇంటి పట్టాలు వచ్చే వరకు అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళా ఒక ‘వీరనారి’గా నడుము బిగించి, తమ హక్కుల సాధన కోసం చైతన్యంతో అడుగు ముందుకు వేయాలన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కుల గురించి అందరూ చర్చించుకోగా, ఆ ప్రాంతమంతా “జై భీమ్” నినాదాలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో పసల సంతోషి, ఉప్పలపాటి సుందరమ్మ, గొల్లపల్లి సంతోషి, నాగులారం కుమారి, పందింటి మేరి, ఉప్పలపాటి మరియమ్మ,



ఉప్పలపాటి హేమ, గొల్లపల్లి ప్రోధనమ, పసల మేరి, పసల రాణి, సింగమల దేవక్క, పిల్లి సారమ్మ, మాణిక్యమ్మ, కుమారి (గౌసియా), జేస్తాది రుతు, జెస్తాది రాజమ్మ, గుడిమే సరస్వతి వంటి వీరనారిమణులతో పాటు పసల దానం, పసల కళ్యాణ్, పసల చిన్నపుల్లయ్య, లంకల శంకర్ యాదవ్, గొల్లపల్లి వినోద్, ఉప్పలపాటి భాస్కర్, నాగుల రాముడు, పసల విజయ్, పసల అజయ్, జమ్మయ్య, జేస్తాది దానం, జేస్తాది చిన్న ఓబులేసు, గుడిమే మోషన్, ఉప్పలపాటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరులో భూ భకాసురులు

తయారైంది.

**కోట్ల విలువైన భూములు స్వాహాకు రంగం సిద్ధం**

రైల్వే కోడూరు మండల పరిధిలోని రైల్వే కోడూరు పంచాయతీలో ఉన్న సర్వే నెంబర్ 51/4, అలాగే రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 743 లో కోట్ల రూపాయల విలువైన భూములను పట్టపగలే చదివిన చేసి కంచి వేశారు. ఇటీవల కాలంలో రైల్వే కోడూరు మండలంలో కబ్జాల పర్వం జోరుగా కొనసాగుతుంది. అనధికార లేఔట్ల తో పాటు ప్రభుత్వ భూముల్లో , కాలువలు కుంటలు అనే తేడా లేకుండా అనుమతి లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్న అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. దీనికి తోడు కబ్జా జరిగిన విషయాన్ని క్రింది స్థాయి అధికారుల నుండి పై స్థాయి అధికారుల వరకు ఎవరినీ అడిగిన ఏమో సార్ మాకు తెలియదు మేము కొత్తగా వచ్చాం, మా దగ్గర సమాచారం లేదు, మాకేం తెలియదు అనే సమాధానం చెప్పడం చూస్తుంటే మరి రైల్వే కోడూరు లో రెవెన్యూ అధికారుల తీరు ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకో.

**కంచె చేను మేస్తే**

కంచె చేను మేస్తే అనే సామెత చాలా విషయాల్లో మనం మాట్లాడుతూ ఉంటాం. అయితే రైల్వే కోడూరు మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి కంచ వేసిన కబ్జాదారులను కాపాడేందుకు అధికారులు తామే కంచవేశామని చెప్పడం చూస్తుంటే కంచే చేను మేస్తే అనే సామెతకు నిజమైన అర్థాన్ని ఇక్కడి రెవిన్యూ అధికారులు తీసుకువచ్చారని ప్రజలు చలోక్తులు విసురుతున్నారు. అసలు ప్రభుత్వ భూమిని చదును చేసి కంచే వేయాల్సిన అవసరం రెవెన్యూ అధికారులకు ఎందుకు వచ్చిందో తెలపాలి.

పట్టపగలు ఆ ప్రాంతంలో చదును చేసి కొందరు కబ్జారాయుళు కంచి వేసిన విషయం అందరూ చూసినా రెవెన్యూ అధికారులు మాత్రం మేమే కంచ వేశామని చెప్పుకోవడం చూస్తుంటే ఇక ప్రభుత్వ భూములకు రక్షణ ఎక్కడ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తుంటే అడ్డుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం చూస్తూ ఉంటాం.మరి రైల్వే కోడూరులో చదువు చేసిన భూమికి రెవిన్యూ అధికారులే కంచవేశారని చెబుతుండడం చూస్తుంటే కబ్జాకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారా అనే అనుమానాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడి, భవిష్యత్తులో అవి ప్రజలకు ఉపయోగపడేలా చేసేందుకు అధికారులు చొరవ చూపాలని, అలాగే ఉన్నతాధికారులు స్పందించి రైల్వే కోడూరు లో జరుగుతున్న కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి కబ్జారాయుళ్లను వారికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఎడ్జ్ మేథస్సుతో బ్యాటరీ రక్షణ,పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పన

## - మిట్స్ ఈఈఈ విద్యార్థుల అద్వితీయ ఆవిష్కరణ




మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు ఎడ్జ్ మేథస్సుతో బ్యాటరీ రక్షణ మరియు పర్యవేక్షణ వ్యవస్థ అనే వినూత్న ప్రాజెక్టును అభివృద్ధి చేశారు.మిట్స్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఏ.వి.పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధి చేసిన ఎడ్జ్ మేథస్సుతో బ్యాటరీ రక్షణ మరియు పర్యవేక్షణ వ్యవస్థ బ్యాటరీల భద్రత,పనితీరు మరియు విశ్వసనీయతను మెరుగుపరచే వినూత్న పరిష్కారమని తెలిపారు.ఈ వ్యవస్థ ద్వారా బ్యాటరీలోని వోల్టేజ్,కరెంట్,ఉష్ణోగ్రత వంటి కీలక సూచికలు తక్షణమే పర్యవేక్షించడంతో పాటు,బ్యాటరీ చార్జ్ స్థితి (ఎస్.ఓ.సి),ఆరోగ్య స్థితి (ఎస్.ఓ.హెచ్)లను కూడా అంచనా వేయవచ్చున న్నారు. హిస్టెరిసిస్ నియంత్రణ పద్ధతిలో పనిచేసే శీతలీకరణ వ్యవస్థ ద్వారా బ్యాటరీ ఉష్ణోగ్రతను సమర్థవంతంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.అలాగే వై-ఫై సాంకేతికత సహాయంతో థింగ్‌స్పీక్ క్లౌడ్ వేదికపై దూర పర్యవేక్షణ,డేటా నిల్వ సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు.అధిక ఉష్ణోగ్రత,అధిక కరెంట్,తక్కువ వోల్టేజ్ వంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించి తక్షణ హెచ్చరికలను అందించే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేకత అని తెలిపారు.ప్రయోగాత్మక పరీక్షల్లో ఈ వ్యవస్థ అత్యుత్తమ ఫలితాలను సాధించిందని,ఎలక్ట్రిక్ వాహనాలు,పునర్వినియోగ శక్తి నిల్వ వ్యవస్థలు మరియు స్మార్ట్ బ్యాటరీ నిర్వహణ రంగాల్లో ఇది విస్తృతంగా ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.కేవలం రూ.8,000 వ్యయంతో రూపొందించిన ఈ వ్యవస్థ తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన సాంకేతిక పరిష్కారంగా నిలిచిందని,ఈ ప్రాజెక్టు యొక్క వినూత్న రూపకల్పనకు సంబంధించి భారతీయ పేటెంట్ దరఖాస్తును మిట్స్ మరియు ఐపీఎఫ్‌సీ సంస్థల ద్వారా దాఖలు చేసినట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టును డాక్టర్ ఏ.వి.పవన్ కుమార్ పర్యవేక్షణలో ఎన్.నిహాంత్ కుమార్,ఎ.నాగ వర్ధన్ రెడ్డి,సి.నవ్య శ్రీ,ఎస్.షాహుల్ హుస్సేన్ విజయవంతంగా రూపొందించారు.

# బిసిల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుదాం

## - బిసివై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్,బోడెం రాజశేఖర్ పిలుపు

## - మదనపల్లెలో ఇరువురు నేతల ఆత్మీయ కలయిక





మదనపల్లె (ప్రజా సీమ) : వెనుకబడిన తరగతుల (బిసి) అభివృద్ధి, సాధికారత,రాజ్యాధికారం కోసం బిసి సంఘాల ఐక్యత ఎంతో అవసరమని బిసివై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్,బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్ పేర్కొన్నారు.గురువారం మదనపల్లెకు విచ్చేసిన బిసివై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా రామచంద్ర యాదవ్ కు బిసి హక్కుల పోరాట సమితి నాయకులు సాదర స్వాగతం పలికి దుశ్శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు,ప్రజా సమస్యలతోపాటు పలు అంశాలపై చర్చించారు. బిసిలందరూ తమ విభేదాలను పక్కన పెట్టి,ఒకే వేదికపైకి రావడం ద్వారా మాత్రమే చట్టసభల్లో సముచిత స్థానం,ఆర్థికాభివృద్ధి, రిజర్వేషన్ల ఫలాలు పూర్తి స్థాయిలో అందుకోగలరని అభిలాషించారు.బీసీ ఐక్యత రాజ్యాధికార సాధన,జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే అన్నికులాల విభేదాల వీడి ఐక్యతగా ఉండాలన్నారు.బిసిల పేరు చెప్పుకునే అధినాయకులు స్వప్రయోజనాలు పక్కనపెట్టి, సామాజిక న్యాయం కోసంకులాలకతీతంగా కలిసి పనిచేయాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు.బీసీలకు విద్య,ఉద్యోగాల్లోనే కాకుండా ఆర్థికంగా,రాజకీయంగా సాధికారత లభించినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా ఈనెల 18వ తేదీ పుంగనూరు పట్టణంలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఇందులో 137 ప్రసిద్ధిగాంచిన కంపెనీలు పాల్గొంటున్నాయని కావున 10వ తరగతి నుండి పీజీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి హక్కుల పోరాట సమితి నాయకులు రామాంజనేయులు,చిన్న రెడ్డెప్ప,రామలింగ,చంద్రయ్య,సిద్దయ్య,జయన్న,సుబ్బరాజు,సుకుమార్,మోహన్ యాదవ్,గంగిరెడ్డి,శ్రీనివాసులు,రామ్మోహన్,వెంకటేష్,శ్రీనివాసులు,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో పర్యటించిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

## - అపూర్వ స్వాగతం పలికిన పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి



మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ గనులు,భూగర్భ వనరులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం మదనపల్లెలో పర్యటించారు.ముందుగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర,రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు,రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి,పఠాన్ ఖాదర్ ఖాన్,కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి,తంబళ్లపల్లె పరిశీలకులు దినేష్ రెడ్డి,శ్రీరామ్ చినబాబు,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీను),పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.ముందుగా పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలిలు మంత్రి కొల్లు రవీంద్రను శాలువాతో ఘనంగా సన్మానించి అపూర్వ స్వాగతం పలికారు.రాష్ట్ర అభివృద్ధి,ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,పార్టీ బలోపేతమే లక్ష్యంగా టీడీపీ నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగుతుండగా,కార్యకర్తల శక్తితో ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు.మదనపల్లిలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఘనస్వాగతం పలకడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.అనంతరం నాగూర్ వలి మాట్లాడుతూ గనులు,భూగర్భవనరులు,ఎక్సైజ్ శాఖలను మంత్రి కొల్లు రవీంద్ర ఎంతో సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు.రాష్ట్ర అభివృద్ధికి తనదైన కృషి చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ బాబుల ప్రశంసలను అందుకుంటున్నారని కొనియాడారు.

# ఎక్సైజ్,మైనింగ్ రంగాల్లో పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు

## - భూగర్భ గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం

## - ఉమ్మడి జిల్లాల అధికారులతో సమక్షా సమావేశం







మదనపల్లె (ప్రజా సీమ) : ఎక్సైజ్,మైనింగ్ రంగాల్లో పారదర్శకత,సంస్కరణలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనులు,భూగర్భ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.గురువారం అన్నమయ్య జిల్లాకు వచ్చిన సందర్భంగా మదనపల్లె కలెక్టరేట్‌లో అన్నమయ్య,చిత్తూరు,తిరుపతి ఉమ్మడి జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్నమయ్య,చిత్తూరు,తిరుపతి జిల్లాలకు సంబంధించిన ఎక్సైజ్ అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించి,ప్రస్తుత పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు.ఎక్సైజ్ శాఖలో గతంలో నెలకొన్న పరిస్థితులను సరిదిద్దుతూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం ద్వారా ప్రస్తుతం 60 నుంచి 70 శాతం వరకు డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని,వాటిని 100 శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.సరిహద్దు జిల్లాల్లో నాన్-డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు తీసుకున్న చర్యల వల్ల ఆదాయంలో 30 నుంచి 40 శాతం వరకు వృద్ధి నమోదైందన్నారు.అక్రమ మద్యం విక్రయాలు,బెల్ట్ షాపులు,గంజాయి రవాణా వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని,అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.మద్యం నాణ్యత,ధరలు,ఎంఆర్పీ ఉల్లంఘనలు,విక్రయ సమయాల అమలు తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.విధి నిర్వహణలో అనారోగ్యంతో మరణించిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగి కుటుంబానికి శాఖ ఉద్యోగుల సంఘం ద్వారా రూ.5 లక్షలు,ప్రభుత్వ తరపున మరో రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేశామని తెలిపారు.అలాగే ఆయన భార్యకు కారుణ్య నియామకం కింద త్వరలోనే ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.మైనింగ్ రంగంపై మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మదనపల్లి వైట్,ఐస్కాన్ వైట్,కలర్ గ్రానైట్ వంటి ఖనిజాలకు డిమాండ్ ఉందన్నారు.ఖనిజ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలు,నిబంధనల అమలును పరిశీలించేందుకు క్వారీలను సందర్శిస్తున్నామని చెప్పారు.ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తిస్తే విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మైనింగ్ రంగంలో పెండింగ్ సమస్యలను పరిష్కరించడం వల్ల కార్యకలాపాలు పునరుద్ధరించబడి,ప్రభుత్వ ఆదాయంలో సుమారు 40 శాతం వృద్ధి నమోదైందన్నారు.భవిష్యత్తులో బీచ్ సాండ్ మినరల్స్,ఐరన్ ఓర్,లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరుల అన్వేషణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ప్రజల అభిప్రాయాలు,పర్యావరణ,అటవీ శాఖల అనుమతులు వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించి వాల్యూ అడిషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.రాష్ట్రంలో ఉన్న ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఈ సమావేశంలో స్థానిక శాసనసభ్యులు షాజహాన్ బాషా,జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ,తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# యమునా పుష్కరయాత్రలో నైనారి పాల్గొన్న దంపతులు

## - ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాల సందర్శన






మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె నుండి ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ,రిటైర్డ్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్,సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ప్రివిలేజ్ కమిటీ లైఫ్ మెంబర్ దనలక్ష్మిలు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో మధురలో జూన్ 2వ తేదీ నుండి 13వ తేదీ వరకు జరిగిన యమునా పుష్కరాలకు హాజరై అన్నప్రసాద వితరణ సేవలో పాల్గొన్నారు.అలాగే మధుర,బృందావన్,అయోధ్య,న్యూఢిల్లీ,ఆగ్రా మొదలగు పుణ్య క్షేత్రాలు,విహార యాత్రకు వెళ్లి వివిధ ప్రదేశాలను తిలకించారు.మొదట మదురలో కృష్ణుడు బాల్యంలో మట్టి తిన్నటు వంటి ప్రాంతాన్ని దర్శించి ఆ మట్టిని ఆంధ్రప్రదేశ్ తీసుకొచ్చారు.మధురలో ద్వారకా ధీస్,రమణ ఆశ్రమం,గోకుల్ మందిర్,ఛారదాంలను ప్రదేశాలను దర్శించారు.అలాగే మధుర దగ్గరలోని బృందావనంలో అనంత శ్రీధామ్ లో మాతాజీ భవంతిలో విడిది చేశామని,తరువాత అయోధ్యలో సరయు నదిలో పుణ్యస్నానం ఆచరించి,అయోధ్యలోని బాలరాముని దర్శనం చేసుకోవడంతోపాటు హనుమాన్ గడి సందర్శించారు.ఆగ్రాలోని తాజ్ మహల్,ఆగ్రా ఫోర్ట్,ఫతేపూర్ సిక్రీ దర్శించారు.న్యూఢిల్లీలో ఇండియా గేటు,లోటస్ టెంపుల్,గాంధీ స్మృతి భవన్,ఇందిరా గాంధీ భవన్,ఆంధ్రప్రదేశ్ భవన్,కుతుబ్ మీనార్,తుప్పు పట్టని ఇనుప స్తంభము,జంతర్ మంతర్,రెడ్ ఫోర్ట్,పార్లమెంట్ భవన్ సందర్శించడమే కాకుండా మధురకు దగ్గరలోని ఆగ్రా ఎయిర్ పోర్టు నుండి కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ బెంగళూరు చేరుకోవడం జరిగిందన్నారు.ఈ విహారయాత్రకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు,ద్వారకా తిరుమల బ్రాహ్మణ నిత్యాదాన సమాజం చైర్మన్ వెంపరాల నారాయణ మూర్తికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

# దివంగత పంజం రామలక్ష్మమ్మకు నివాళులర్పించిన మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు

రైల్వే కోడూరు( ప్రజా సీమ ): తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట పంచాయతీ తూర్పు పల్లి గ్రామానికి చెందిన వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు పంజం వేణుగోపాల్ రెడ్డి, దివంగత పందెం సుకుమార్ రెడ్డి మాతృమూర్తి రాములక్ష్మమ్మ పెద్దకర్మకు స్వగ్రామంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు హాజరై హాజరై రామలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు, దుర్గా నాగేంద్ర,మాదినేని వెంకట్ రెడ్డి, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు, డి ఆర్ యు సి సి గుంతకల్ రైల్వే నెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి,అంబటి మురళి,స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ నందాబాల, అన్నమయ్య జిల్లా యువజన విభాగం



అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి,న్యాయవాది వెంకట్రామరాజు, ఓబుల్ రెడ్డి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి లింగం లక్ష్మీకర్, జిల్లా యూత్ సెక్రెటరీ దమ్ము రఘు, ఎంపీటీసీలు, బండారు మల్లి, ఘని (రాజా ) ఆకేపాటి రంగారెడ్డి, డివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేటిపత్రిక PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# యువ క్రీడాకారులతో యువ నేత

## -క్రీడలు అంటే భవిష్యత్ సవాళ్లకు పునాది
## -గెలుపు ఓటమి ల రుచి ఇక్కడి నుండే మొదలవుతుంది
## -క్రీడలతో శారీరిక,మానసిక ఉల్లాసం
## - తెదేపా నియోజకవర్గ యువనాయకులు చమర్తి లోకేష్ రాజు







సిద్ధవటం (ప్రజా సీమ) క్రీడలు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు మొదటి అడుగు అని, క్రీడల ఉండే భవిష్యత్తులో మనకు లభించే గెలుపు ఓటమిల అసలైన మజా ఆస్వాదించవచ్చని,క్రీడలు శారీరిక దృఢత్వంతో పాటు,మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తనయుడు టిడిపి యువనేత లోకేష్ రాజు పేర్కొన్నారు. గురువారం నాడు సిద్ధవటం మండలం,మాధవరం నందు స్థానిక జెఎంఆర్ మెగా యూత్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి టోర్నమెంట్ కార్యక్రమాన్ని సిద్ధవటం మండల అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్,ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వీర్నాల రామచంద్ర,పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రాజేష్ నాయుడు దార్పనేని తో కలిసి చమర్తి లోకేష్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని చమర్తి లోకేష్ రాజు తెలియజేసారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలని చమర్తి లోకేష్ రాజు తెలియజేశారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. అంతకుముందు టోర్నమెంట్ ను ప్రారంభించి సరదాగా కాసేపు క్రికెట్ ఆడుతూ క్రీడాకారులను చమర్తి లోకేష్ రాజు అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ ముఖ్య నాయకులు/యువత/ టోర్నమెంట్ ఆర్గనైజర్లు /క్రీడాకారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మరోసారి గొప్పమనసు చాటుకున్న వల్లిగట్ల రెడ్డెప్ప

## - కనకదాస కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.12.5 లక్షల విరాళం
## - కురబ సామాజిక సేవా సొసైటీ ప్రతినిధుల వెల్లడి





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలో కనకదాస కళ్యాణ మండపం నిర్మాణానికి 12.5 లక్షల ఆర్థిక సహాయం అందించిన బిజెపి జాతీయ నాయకులు,దాత వలిగట్ల రెడ్డెప్పకు కురబ సామాజిక సేవా సొసైటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దండు రామాంజులు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కురబ సామాజిక సేవా సొసైటీ ప్రతి నిధులు మాట్లాడుతూ కురబ సమాజ అభివృద్ధి కోసం అసంపూర్తిగా ఆగిపోయిన కనకదాస కళ్యాణ మండపాన్ని పూర్తి చేయడానికి రాష్ట్రస్థాయిలో పెద్దమొత్తంలో విరాళాన్ని అందజేసిన బిజెపి జాతీయ నాయకులు వల్లిగట్ల రెడ్డెప్ప సేవలకు కురబ సమాజం తరపున ధన్యవాదాలు తెలుపుతూ ఎప్పటికీ ఆయన సేవలను గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా అన్నదాన భవన్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకోవడానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయ,సహకారాలు అందించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు కురబ సామాజిక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి డివిజన్ కమిటీ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కనకదాస కళ్యాణ మండపాన్ని పూర్తి చేయడం కోసం డివిజన్ కమిటీతోపాటు సభ్యులు ముందుకు వచ్చి పెద్దఎత్తున విరాళాలు సేకరించి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా సహకరించాలని కోరారు. ఇప్పటికే దాతల సహకారంతో వైకుంఠ రథం సేవలు అందిస్తోందని,కనకదాస నగర్ ను అభివృద్ధి పథంలో నడిపించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కురబ సామాజిక సేవా సొసైటీ ప్రతినిధులు వల్లిగట్ల వెంకటరమణ,దండు రామాంజులు,ఆర్.కే శ్రీనివాసులు,జీవి శివ కుమార్,సర్కారుతోపు శ్రీనివాసులు,వెంకట రమణ,అప్పయ్య,రామకృష్ణ,గుర్రప్ప,ప్రసాద్ తదితరులు లు పాల్గొన్నారు.

# మంత్రి కొల్లు రవీంద్రకు అపూర్వ స్వాగతం ఎమ్మెల్యే ఆయన తనయుడు

## - శాసనసభ్యుల నివాసం వద్ద టీడీపీ శ్రేణుల సందడి





మదనపల్లె (ప్రజా సీమ) : గనులు భూగర్భ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లికి విచ్చేసిన గనులు భూగర్భ,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆయన తనయుడు జునైద్ అక్బరీలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నివాసానికి మర్యాదపూర్వకంగా విచ్చేసిన ఎమ్మెల్యేకి తెలుగుదేశం శ్రేణులు అపూర్వసాగతం పలికాయి. ఎమ్మెల్యే నివాసంలో అల్పాహారం తీసుకున్న మంత్రి వలసపల్లి సమీపంలోని క్వారీల సందర్శనకు ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఒకవైపు అభివృద్ధి,మరోవైపు ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని కొనియాడారు. ఇక నూతనంగా ఏర్పడిన మదనపల్లి జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాటకొండ భారతి,పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి,బోనాసి జాన్ బాబు,మడితం రమణ,నందకుమార్,జెసిబి వేణు,రాధమ్మ,నాగమణి,రెడ్డి బూ,పరుపుల జయరాం యాదవ్,గౌస్ ఆజామ్,కొప్పల హరినాథ్,గండికోట గణేష్ బాబు,పసుపులేటి శ్రీనివాసులు,పోతపోలు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ సభను విజయవంతం చేయండి

## -టి.డి.పి మండల అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు

పుల్లంపేట,(ప్రజా సీమ) రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి చేపట్టి రెండేళ్లు పూర్తి అయినా సందర్భంగా తిరుపతి ప్రాంతంలో జరిగే విజయోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు పిలుపునిచ్చారు. రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు రావాలని ఈ విజయోత్సవ సభ చంద్రగిరి నియోజకవర్గంలో తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ దామనేరులో సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ విజయోత్సవ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షులు మాధవ్,రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు ఎన్డీఏ కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు భారీగా వస్తారని మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీలలో ఉన్నటువంటి ఎన్డీఏ కూటమి కార్యకర్తలు సభకు వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చలంపాలెం నివాసి మృతి నివాళులర్పించిన ముక్కా సాయికాస్ రెడ్డి





ఓబులువారిపల్లి (ప్రజా సీమ): తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం కొర్లకుంట పంచాయతీ చలంపాలెం గ్రామ వాస్తవ్యులు దక్షారాజు వెంకటరాజు స్వర్గస్తులయ్యారని తెలుసుకొని వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయుకులు పాల్కొన్నారు.

# తిరుపతి విజయోత్సవ సభను విజయవంతం చేయండి

## -టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి



సిద్ధవటం,(ప్రజా సీమ):రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి చేపట్టి రెండేళ్లు పూర్తి అయినా సందర్భంగా తిరుపతి ప్రాంతంలో జరిగే విజయోత్సవ మహాసభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయోత్సవ సభ చంద్రగిరి నియోజకవర్గంలో తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ దామనేరులో సభ జరుగుతుందని ఆయన తెలిపారు .ఈ విజయోత్సవ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షులు మాధవ్,రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు ఎన్డీఏ కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు భారీగా వస్తారని ఆయన తెలియజేశారు ఎన్డీఏ కూటమి కార్యకర్తలు సభకు వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# క్రీడలతో శారీరిక,మానసిక ఉల్లాసం

## - ఒంటిమిట్ట మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన - చమర్తి లోకేష్ రాజు

ఒంటిమిట్ట (ప్రజా సీమ):క్రీడలు శారీరిక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని టిడిపి యువ నాయకులు చమర్తి లోకేష్ రాజు పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్ట మండలం నందు పర్యటిస్తూ స్థానిక జెఎంఆర్ మెగా యూత్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి టోర్నమెంట్ కార్యక్రమాన్ని ఒంటిమిట్ట మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి,ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, ఒంటిమిట్ట సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీనివాసులు, ఎస్వీ రమణ లతో కలిసి చమర్తి లోకేష్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని చమర్తి లోకేష్ రాజు తెలియజేసారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలని అన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. అంతకుముందు టోర్నమెంట్ ను ప్రారంభించి సరదాగా కాసేపు



క్రికెట్ ఆడుతూ క్రీడాకారులను చమర్తి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ ముఖ్య నాయకులు, యువత టోర్నమెంట్ ఆర్గనైజర్లు క్రీడాకారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక


# కృష్ణా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా 'బుక్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమం

**- రాష్ట్రంలోనే కృష్ణా జిల్లా గ్రంథాలయ సేవలు ఆదర్శం: జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్**








(ప్రజా సీమ)మచిలీపట్నం: జూన్ 11 : కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, హరిత ఫౌండేషన్ సహకారంతో బుధవారం 'బుక్ డొనేషన్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడే విలువైన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు వివిధ శాఖా గ్రంథాలయాలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.ఎస్. బేగ్, హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సాందేపని వర్జె హాజరయ్యారు.

**రాష్ట్రస్థాయిలో కృష్ణా జిల్లా గ్రంథాలయాల సేవలు అద్భుతం:**

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని గ్రంథాలయాలతో పోల్చితే, కృష్ణా జిల్లా గ్రంథాలయాల పనితీరు అత్యుత్తమంగా ఉందని కొనియాడారు. ఛైర్మన్, కార్యదర్శి సిబ్బంది అంకితభావంతో పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని అభినందించారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

**రూ. 20 లక్షల విలువైన పుస్తకాల వితరణ:**

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.ఎస్. బేగ్ మాట్లాడుతూ, సుమారు రూ. 20 లక్షల విలువైన పుస్తకాలను అందించిన హరిత ఫౌండేషన్, ఎమెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇతర దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తకాలు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠకులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

**నైతిక విలువలే ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి:**

హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సాందేపని వర్జె మాట్లాడుతూ, విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించడంతో పాటు, ఉద్యోగ జీవితంలో నైతిక విలువలను పాటించాలని సూచించారు. తాము ఎదిగి సమాజానికి తిరిగి సేవ చేసే స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నిరంతర అభివృద్ధికి కృషి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీ. రవికుమార్ మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి పాఠకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే, డిప్యూటీ లైబ్రేరియన్ బీరెం వెంకటరమణ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతమైందని, దాతలు అందించిన పుస్తకాలను త్వరలోనే శాఖా గ్రంథాలయాలకు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జి. రాధికా రాణి, యు. యోగేశ్వరరావు, బి. రమేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, రిఫరెన్స్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.

# 2002, 2025 ఓటర్ల జాబితాలను సరిపోల్చి చూస్తున్నాం




బాపట్ల, (ప్రజా సీమ) : ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీ లో పారదర్శకంగా 2002, 2025 ఓటర్ల జాబితాలను సరిపోల్చి చూస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ గురువారం స్థానిక కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ వరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీ విధానం కొనసాగుతుందని కలెక్టర్ చెప్పారు. జులై 21న డ్రాఫ్ట్ రోల్ ప్రకటిస్తామని, నంబర్ 18వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 22న తుది జాబితాకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న మూడు నెలలు సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ సమర్థంగా నిర్వహించడానికి యంత్రాంగం ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. బిఎల్వోలు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ నిర్వహించనున్నారని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. బి ఎల్ ఏ లను ఆయా పార్టీల నుంచి నియమించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బి ఎల్ ఓ లకు పార్టీలో నియమించుకున్న బి ఎల్ ఏ లు సహకరించాలన్నారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ 65.5శాతం పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటు హక్కుకు ఆధార్ కార్డు ఒకటే ప్రామాణికం కాదని, 13 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయన్నారు. ఓటర్ల విచారణ ప్రక్రియకు బిఎల్వోలు వస్తే మీ ధృవీకరణ పత్రాలు చూపాలన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియపరచాలన్నారు. 1212 పోలం కేంద్రాలు ఉన్నాయని, అత్యంత పారదర్శకంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. జిల్లాలో 2 వేల విఐపి ఓట్లు ఉండగా విచారిస్తున్నామన్నారు. 1,288 నుంచి ఫిర్యాదులు రాగా, అన్ని పరిష్కరించామని, ఏడు మాత్రమే పెండింగ్ లో ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, రాజకీయ పార్టీల నాయకులు రామకృష్ణ, గంగయ్య, రవి, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

**- స్కానింగ్ సెంటర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే 18002332447కు సమాచారం ఇవ్వండి**

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు**





నెల్లూరు, (ప్రజా సీమ) : జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా టోల్ ఫ్రీ నెంబరు 18002332447 కు వెంటనే ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరు వారి క్యాంపు కార్యాలయంలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి పిఎన్‌డిటి),సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏ ఆర్ టి) అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీలలో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు కూడా పాల్గొనాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ చెప్పారు. వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వి. సుజాత, డి ఐ ఓ డాక్టర్ ఏ. ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్ భాస్కర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, డెమో కె. కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల అమ్మకాలు ఏపీ ఎఐఎంఎస్ యాప్ ద్వారానే నిర్వహించాలి

**- ఎరువుల అమ్మకాల్లో పారదర్శకతకు ఏపీ ఎఐఎంఎస్ కీలకం**

**- రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, పారదర్శకంగా సరఫరా చేయాలి**

**- జి.కొండూరు మండలంలో ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

విజయవాడ, జూన్ 11 :రైతులకు అవసరమైన ఎరువులను ఏపి ఎఐఎంఎస్ యాప్ ద్వారానే నిర్వహించాలని రైతుల అవసరాలకు అనుగుణంగా సకాలంలో ఎరువులను సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఎరువుల అమ్మకదారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని మనగ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, విక్రయాల నమోదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, రైతులకు జారీ చేస్తున్న బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా, సమర్థవంతంగా సరఫరా చేయడానికి ప్రభుత్వం ఏపీఏఐఎంఎస్ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి యాప్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గత ఏడాది ఖరీఫ్ పంట నమోదును ఏపీఏఐఎంఎస్ యాప్‌తో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఎరువుల అమ్మకదారులు యాప్‌లో లాగిన్ అయి రైతు ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలని, అనంతరం రైతు మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేసిన తర్వాత రైతుకు సంబంధించిన భూమి, పంట వివరాలు యాప్‌లో నమోదై ఉంటాయన్నారు. రైతు సాగు చేస్తున్న పంట అవసరాలకు అనుగుణంగా మొదటి, రెండో, మూడో విడతలుగా ఎరువులను సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి డోస్‌కు తదుపరి డోస్ మధ్య కనీసం 20 రోజుల వ్యవధి ఉండేలా ఎరువుల పంపిణీ నిర్వహించాలన్నారు. ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారానే నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన విధానాలను పాటించకుండా వ్యవహరించినట్లయితే సంబంధిత అమ్మకదారుల పై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందేలా ప్రతి ఎరువుల అమ్మకదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా డీలర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు జారీ చేయాలని, ఎరువుల ధరల పట్టికను దుకాణంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. ఎరువుల నిల్వల వివరాలు, విక్రయాల సమాచారం, అందుబాటులో ఉన్న రకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా తగిన నిల్వలను నిర్వహిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీలర్లకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల దుకాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎరువుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎరువుల పంపిణీకి సంబంధించి ప్రతి లెక్కా చాలా పక్కాగా ఉండాలని.. ఎక్కడ ఎలాంటి ఫిర్యాధులు రానీయరాదన్నారు. ఎరువుల వివరాలు వాటి ధరలు, ఇప్పటి వరకు జరిగిన అమ్మకాల వివరాలను నోటీస్ బోర్డు నందు తప్పని సరిగా పొందుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.





# ఈ నెల 12న విస్సన్నపేటలో ప్రత్యేక గ్రీవెన్స్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

ఎన్‌టీఆర్ జిల్లా, (ప్రజా సీమ) : తిరువూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 12వ తేదీ శుక్రవారం విస్సన్నపేట మండలంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే ఈప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట మండలాలకుచెందిన ప్రజల నుంచి అర్జీలను ఉదయం10గంటలనుంచి స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రత్యక్షంగా పాల్గొని, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారనిపేర్కొన్నారు. తిరువూరు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునితమ సమస్యలను అధికారులదృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

PRGI Regd. No : APTEL/26/A0819
దినపత్రిక ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక



# గుడివాడ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి

## -ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





(ప్రజా సీమ) గుడివాడ, జూన్ 11: పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అధికారుల సమన్వయంతో ఒక్కొక్క పనిని ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. గుడివాడ పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధ్యక్షతన మెగా ఇంజినీరింగ్ ప్రతినిధులు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమృత్ 2.0 పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ మరియు అధికారులు వివిధ అభివృద్ధి పనుల పురోగతి వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. త్రాగునీటి సరఫరా ప్రాజెక్టులో భాగంగా 3 ఎలివేటెడ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్ల పనులను వారం రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. యు.జి.డి నెట్‌వర్క్‌కు సంబంధించి రాజేంద్రనగర్ ఏరియాలో నెల రోజుల్లో పనులు మొదలుపెడతామని, బేతవోలు చెరువు అభివృద్ధి పనులు 15 రోజుల్లో ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ఒక్కొక్క పనిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఉన్న పాత త్రాగునీటి పైప్‌లైన్‌ల స్థానంలో నూతన పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టణ అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్న మెగా ఇంజినీరింగ్ సంస్థ నిర్వాహకులకు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు. ౹ా4లో భాగంగా గుడివాడ అభివృద్ధిలో మరింత మంది పారిశ్రామికవేత్తలు, సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎం.ఈ ప్రసాద్,పబ్లిక్ హెల్త్ ఈ.ఈ ప్రవీణ్, డి.ఈ పాండురంగ, మున్సిపల్ డీఈ శరత్ చంద్ర, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, బూరగడ్డ శ్రీకాంత్, పంద్రాజు సాంబయ్య,చెకూరు జగన్మోహన్ రావు,మెగా ఇంజినీరింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహ సముదాయంలో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఈ ఎల్ ఎస్ ఆర్ ట్యాంక్‌కు శంకుస్థాపన

## -ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

జగ్గయ్యపేట: జూన్ 11 (ప్రజా సీమ): జగ్గయ్యపేట పట్టణంలోని టిడ్కో గృహ సముదాయంలో నిర్మించబడనున్న 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ (ఈ ఎల్ ఎస్ ఆర్ ) ట్యాంక్‌కు ఈ రోజు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మరియు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర రంగాపురం సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. యూఐడీఎఫ్ 2.0 పథకం కింద చేపట్టబడుతున్న ఈ ప్రతిష్టాత్మక నీటి సరఫరా ప్రాజెక్టు ద్వారా టిడ్కో గృహ సముదాయం, ఎల్పీ -1, ఎల్పీ -2, క్రిస్టియన్‌పేట మరియు మిట్టగూడెం ప్రాంతాలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుంది. సుమారు 20 వేల మంది ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం చేకూరనుంది. ఈపనులను మేఘా సంస్థ చేపట్ట నుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. టిడ్కో గృహ సముదాయంతో పాటు పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈఈ ఎల్ ఏస్ ఆర్ ట్యాంక్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జగ్గయ్యపేట అభివృద్ధికి అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర రంగాపురం మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును



అమలు చేస్తున్నామని తెలిపారు. 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఈ ఎల్ ఎస్ ఆర్ ట్యాంక్ పూర్తయిన తర్వాత టిడ్కో, ఎల్పీ -1, ఎల్పీ -2, క్రిస్టియన్‌పేట, మిట్టగూడెం ప్రాంతాల్లో నీటి సరఫరా గణనీయంగా మెరుగుపడుతుందని చెప్పారు. పట్టణ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, మున్సిపల్ కమిషనర్ పి .వి .వి .డి ప్రసాద్,డీఈ శివ కోటేశ్వరరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, సూర్యదేవర రాంప్రసాద్, మారేపల్లి శౌరి, పూసల పుల్లారావు, గింజుపల్లి కృష్ణ, దువ్వల రామకృష్ణ, షేక్ అక్బర్, షేక్ మదార్, సయ్యద్ ఉమ్మర్, షేక్ రఫీ,ముళ్ళపూడి అప్పారావు, మొగిలి సైదులు, గుంటూరు సోములు, వంకాయలపాటి శ్రీను మరియు మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంపియన్ ఫార్మర్లు అందరు బ్రాండ్ అంబాసిడర్ లు గా వ్యవహరించాలి..... జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా





నెల్లూరు, జూన్ 11 : రైతులు తాము పండించే పంటలను మార్కెట్లో ఉన్న డిమాండును బట్టి మార్పు చేసుకొని పంటలు పండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం స్థానిక యన్.జి రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆద్వర్యములో చాంపియన్ ఫార్మర్స్ తో "కిసాన్ గోష్టి " కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చాంపియన్ ఫార్మర్ కనీసం 10 మందిగి స్ఫూర్తి దాయకం కావాలని తద్వారా జిల్లాలో 7 వేల మంది చాంపియన్ ఫార్మర్లు గా తయారు కావలసిన అవసరం ఉందన్నారు. రైతులు మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటల వైపు మొగ్గు చూపి తగిన రాబడి పొందాలని సూచించారు. చాంపియన్ ఫార్మర్లు వారి తోటి వారికి స్ఫూర్తి దాయకం కావాలని పిలుపినిచ్చారు. తాను జిల్లా కలెక్టర్ గా గత సెప్టెంబర్ మాసంలో వచ్చాని ఇక్కడి పరిస్థితులు ఆకళింపు చేసుకొని చాంపియన్ ఫార్మర్ లను తీసుకు రావడం జరిగిందన్నారు. మార్పు అనేడి ఇప్పటికిప్పుడు రాదనీ, దానికి మరికొంత కాలం పడుతుందన్నారు. తానూ అనేక దేశాలు తిరిగానని ఆమ్బర్ డాం చూసినప్పుడు ఆక్కడి వ్యవసాయ పద్దతులను చూడడం జరిగిందన్నారు. సుమారు వంద ఏకరాలను ఇద్దరు మానిటర్ చేస్తున్నారని కేవలం ఆటో మేటిక్ మరియు సాంకేతికతతో అది సాద్యం అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరుగుతూ ఉంటాయన్నారు. అర్బనైజేషన్ వల్ల కొంత మేర అసౌకర్యం కలుగుతున్నదని అభిప్రాయ పడ్డారు. చాంపియన్ ఫార్మర్ లు విజయాలు సాధిస్తే ఆ విజయం వారిదని అదే నష్టం వాటిల్లితే ఆ నష్టం తాము భరిస్తానని ఆయన తెలిపారు. మర్పులు, సాంకేతికతను రైతులు అలవరచుకోవాలని సూచించారు. రైతులు సమయానుకూలంగా మారవలసిన అవసరం ఉన్నదన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ మరియు పశు సంవర్ధక శాఖ కు సంబంధించి పలువురు చాంపియన్ ఫార్మర్ లు కృష్ణా రెడ్డి,వెంకట రత్న కుమారి,చిరంజీవి,లక్ష్మయ్య, పెంచలమ్మ,లక్ష్మి కుమారి, కాంతా రావు, విలిబుచ్చారు.



# పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు

## -పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి

(ప్రజా సీమ) :గుడ్లవల్లేరు: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని అన్న మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేస్తూ... మన పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ విషయమై మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అందరు గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీలలో అమలు చేస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, స్వచ్ఛ రథం నిర్వహణ, చెత్త సేకరణ, తడి-పొడి చెత్త వేరు చేయడం, గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం తదితర అంశాలపై విస్తృతంగా ఎంపీడీవో ఇమ్రాన్ చర్చించారు. స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా డిప్యూటీ ఎంపీడీవోలు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మరియు స్వచ్ఛ రథం నిర్వహణను నిరంతరం పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని ఎంపీడీవో ఇమ్రాన్ సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపరచవచ్చని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ గ్రామాల లక్ష్యాన్ని సాధించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవోలు జి.ఎస్.ఎస్.అంజనాదేవి.ఎలీషారావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ స్వరూప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ పోలుకొండ బలరాం, సాయి శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఏజేల్ నరసింహారావు, బలగం వెంకటరమణ డి.ఫణిదీప్, పామర్తి దుర్గా నాగమల్లేశ్వరరావు, జగదీష్, సుధారాణి, జగదీష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణకు జిల్లా యంత్రాంగం ఘన సన్మానం



(ప్రజా సీమ) జూన్ 11(మచిలీపట్నం):ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్, ప్రముఖ తెలుగు రంగస్థల కళాకారుడు, పద్యనాటక గాన గంధర్వుడు కళారత్న గుమ్మడి గోపాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మక సంగీత నాటక అకాడమీ అవార్డు ప్రకటించడం పట్ల జిల్లా కలెక్టర్ డీకే బాలాజి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన గుమ్మడి గోపాలకృష్ణ 1955లో జన్మించారు. ప్రముఖ నాటకకర్త ఆచంట వెంకటరత్నం ప్రోత్సాహంతో 1982లో నాటక రంగంలో ప్రవేశించి, తన అపూర్వ ప్రతిభతో తెలుగు రంగస్థల కళారంగంలో విశిష్ట స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ డిజిటల్ సాంకేతికతను వినియోగించి నాటక రంగాన్ని యువతరానికి చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసీ) ఎస్. పోతురాజు, పమిడిముక్కల తహశీల్దారు గుమ్మడి గోపాలకృష్ణను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. తెలుగు నాటక రంగానికి గుమ్మడి గోపాలకృష్ణ అందించిన సేవలకు గుర్తింపుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా జిల్లా అధికారులు పేర్కొన్నారు.

# హామీ ని నిలబెట్టుకున్న చంద్రబాబు లకనం

## – ఆక్వా రైతులకు రూ.1.50 పైలకు సబ్సిడీ పై విద్యుత్ కు జీ వో విడుదల పట్ల హర్షం వ్యక్తం చేసిన లకనం



నాగాయలంక :రాష్ట్రంలోని ఆక్వా రైతులకు రూ.1.50 లకు విద్యుత్ సరఫరా చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జీ వో విడుదల చేయడం పట్ల బీసీ నేత తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు లకనం నాగాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన నాగాయలంక లో విలేఖర్లతో మాట్లాడుతూ అప్సాడా యాక్ట్ ద్వారా రిజిస్టర్ ఐన ప్రతి చెరువుకు ఈ రాయితీ విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం వర్తింప చేస్తుందన్నారు. ఇప్పటిదాకా రాయితీ విద్యుత్ కు నోచుకోని అనేక మంది ఆక్వా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. శాసన సభ ఎన్నికల లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జూన్ నెల 9 ,2026న జీ వో ఆర్టి నెంబర్ 196ను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు నాగాంజనేయులు ధన్యవాదాలు తెలిపారు.

# ఆరోగ్యం

## మీరు ఎంతకాలం బతుకుతారో ఇలా తెలుసుకోవచ్చు



మన వేళ్ల గోళ్లలోనే మొత్తం మన జీవిత రహస్యం దాగి ఉందని మీకు తెలుసా? మీ వేలి గోళ్లు ఎంత వేగంగా పెరుగుతాయో దాని ఆధారంగా మీ జీవితకాలం అంచనా వేయవచ్చని హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జన్యుశాస్త్రంలో నిపుణుడు డాక్టర్ డేవిడ్ సింక్లైర్ తెలిపారు. మన శరీరం కొత్త, ఆరోగ్యకరమైన కణాలను ఉత్పత్తి చేసే రేటుకు గోళ్ల ఆరోగ్యం కీలక సూచిక అని తెలిపారు. ఇది ఎంత త్వరగా జరిగితే, వయస్సు సంబంధిత క్షీణత నుండి మనం రక్షించబడే అవకాశం అంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఓ పాడ్ కాస్ట్ లో డేవిడ్ మాట్లాడుతూ..మీ గోళ్ల పెరుగుదల రేటు మీరు వృద్ధాప్యం అవుతున్నారా లేదా అనేదానికి సంకేతమని తెలిపారు. 1979లో జరిగిన ఒక అధ్యయనాన్ని డేవిడ్ ప్రస్తావించారు. ఆ అధ్యయనంలో భాగంగా సైంటిస్టులు వందలాది మంది గోళ్లకు చిన్న కొలత టేపులను అతికించి కొన్ని సంవత్సరాల పాటు వాటి పెరుగుదలను ట్రాక్ చేశారు. 30 సంవత్సరాల ఏజ్ నుండి వారపు వేలుగోళ్ల పెరుగుదల రేటు సంవత్సరానికి 0.5 శాతం తగ్గిందని సైంటిస్టులు కనుగొన్నారు. గోళ్లు దీని కంటే వేగంగా పెరుగుతుంటే, మీ వయస్సులో ఉన్న ఇతర వ్యక్తుల కంటే మీరు వాటిని తరచుగా కత్తిరించాల్సి వస్తే మీరు సగటు కంటే నెమ్మదిగా వృద్ధాప్యం చెందుతున్నారనడానికి ఇది సంకేతం కావచ్చు అని అధ్యయన పరిశోధకులు సూచించారు. తన గోర్లు వాటి పెరుగుదలలో మందగమనం చెందుతున్నాయా లేదా అనే దానిపై తాను శ్రద్ధ వహిస్తానని, తన గోళ్లను కత్తిరించుకోవాల్సిన ప్రతిసారీ తాను ఎంత తరచుగా తన గోళ్లను కత్తిరించుకున్నానని అని ఆలోచిస్తూ ఉంటానని డేవిడ్ తెలిపారు. మన వయసు పెరిగే కొద్దీ రక్త ప్రసరణ మందగించడం వల్ల వయస్సు గోళ్ల పెరుగుదలను ప్రభావితం చేస్తుందని,అంటే గోళ్లకు పెరుగుదలకు ఆజ్యం పోసే పోషకాలు తక్కువగా లభిస్తాయని తెలిపారు. దీనికి అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయన్నారు. తీసుకునే ఆహారం, గోళ్ల లోపాలు ఉన్నవారిలో గోళ్ల పెరుగుదల నెమ్మదిగా ఉండటం వంటివి ఉంటాయి. వేలి గోళ్లు అనేక రకాల ఆరోగ్య సమస్యలకు కీలకమైన సంకేతంగా కూడా ఉండవచ్చన్నారు. వృద్ధులలో గోళ్లపై గట్లు ఏర్పడటం సర్వసాధారణం, ఎందుకంటే అవి వృద్ధాప్యానికి సాధారణ సంకేతం, కొత్త కణాల ఉత్పత్తి మందగించడం వల్ల ఇవి సంభవిస్తాయి. అయితే యువతలో అవి అనేక ఆరోగ్య సమస్యలకు సంకేతంగా కూడా ఉండవచ్చు. గవదబిళ్ళలు, మధుమేహం, హైపర్‌పారాథైరాయిడిజం వంటి ఆరోగ్య సమస్యలకు ఇది సంకేతం అవొచ్చని నిపుణులు కూడా చెబుతున్నారు.

## ఇడ్లీ,దోశ, పూరీ వద్దు..ఓ కప్పు పొద్దున్నే ఇది తింటే ఏ రోగాలు రావు,ఎలా చేయాలంటే

ఈ రోజుల్లో ఏది ఉన్నా లేకున్నా ఆరోగ్యం ఉంటే చాలు రా బాబు అనుకుంటున్నారు అంతా. అందుకే చాలామంది ఏది పడితే అది తినకుండా ఆరోగ్యకరమైన ఫుడ్ నే తింటున్నారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఆరోగ్యంగా ఉండటానికి అవి తినండి, ఇవి తినండి అని ప్రజలకు సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఫుడ్ అంటే అందరికీ గుర్తుకొచ్చేది మిల్లెట్స్. ఎండాకాలం ఆల్రెడీ స్టార్ట్ అయ్యింది. వేసవిలో చలువచేసి నీరసం రాకుండా రోజంతా యాక్టివ్ గా ఆరోగ్యంగాఉండడానికి ఉదయాన్నే ఒకకప్పు రాగులతో చేసిన రైస్ తినాల్సిందే. అయితే దీనిని ఇంట్లో తయారుచేయడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

రాగులతో బ్రేక్ ఫాస్ట్ చేయడానికి కావాల్సిన పదార్థాలు రాగులు పెసరపప్పు నీళ్లు ఉప్పు పచ్చిమిర్చి జీలకర్ర ఇంగువ జీడిపప్పు మిరియాలు జీడిపప్పు

తయారీ విధానం -ముందుగా 1 టీగ్లాసు రాగులను శుభ్రంగా కడిగా రాత్రంతా నానబెట్టుకోవాలి. -తర్వాత 1 కప్పు పెసరప్పుని కలుపుతూ ఆయిల్ లేకుండా మంచి వాసన వచ్చేదాకా వేయించి పక్కనపెట్టాలి. చల్లారిన తర్వాత వీటిని నీళ్లు పోసి 1 గంటపాటు నానబెట్టాలి. -తర్వాత స్టవ్ మీద గిన్నె పెట్టి 8 గ్లాసుల నీళ్లు పోసి నీళ్లు కొంచెం వేడయ్యాక అందులో నానబెట్టిన రాగులను వేయాలి. -రాగులు సగం ఉడికిన తర్వాత అందులో వేయించి నానబెట్టిన పెసరపప్పు వేసి కలిపి నెమ్మదిగా ఉడకనివ్వాలి. -ఉడికి దగ్గరపడిన తర్వాత అందులో రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. -రాగులు,



పెసరపప్పు ఉడికిన తర్వాత స్టవ్ మీద నుంచి దించి పక్కపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ లో 1 స్పూన్ నెయ్యి వేడి చేసి అందులో గుప్పెడు జీడిపప్పు, పావు టీస్పూన్ జీలకర్ర, 1 స్పూన్ కచ్చాపచ్చాగా దంచిన మిరియాలు, రెండు పచ్చిమిర్చి చీలికలు, సన్నగా కట్ చేసిన 1 స్పూన్ అల్లం ముక్కలు,పావు స్పూన్ ఇంగువ, కరివేపాకు వేసి వేయించుకోవాలి. -తర్వాత ఈ తిరగమాతను రాగులు, పెసరపప్పుతో చేసిన మిశ్రమంలో వేసి కలిపితే తినడానికి రెడీ.

తెలుగు వంటలు

## చిలకలూరిపేట స్పెషల్ స్వీట్ రెసిపి.. వేళ్లు కూడా జుర్రుకొని తింటారు,ఎలా చేయాలంటే



పాలతాలికలు ఎప్పుడైనా తిన్నారా? తెలుగు రాష్ట్రాలలోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా పండుగల సమయంలో వీటిని ఎక్కువగా ఇళ్లల్లో చేస్తుంటారు. వినాయకచవితి సందర్భంగా ప్రత్యేకంగా దీనిని ఇంట్లో చేస్తారు. చిలకలూరిపేట, కోనసీయ ఏరియాల్లో అయితే దాదాపు ప్రతి ఇంట్లో దీనిని చేస్తుంటారు. వీటి టేస్ట్ ఒక్కసారి తింటే జన్మలో మర్చిపోరు. దీనిని తయారుచేయడం కూడా చాలా ఈజీ. చాలా రుచికరంగా ఉండే పాలతాళికలను ఇంట్లోనే ఈజీగా తయారుచేయడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

పాలతాళికలు తయారీకి కావాల్సిన పదార్థాలు బియ్యంపిండి యాలకలు పాలు బెల్లం సగ్గుబియ్యం నీళ్లు.

పాతతాళికలు తయారీ విధానం -పావు గ్లాస్ సగ్గు బియ్యం 1 గంటపాటు నానబెట్టుకోవాలి.

-తర్వాత ఓ బౌల్ లో రెండు గ్లాసుల బెల్లం వేసి అందులో 1 గ్లాసు నీళ్లు, నాలుగు యాలకలు వేసి కలుపి ఈ బౌల్ ని స్టవ్ మీద పెట్టి బాగా మరిగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసేయాలి. ఈ పాకం పూర్తిగా చల్లారనివ్వాలి. -తర్వాత స్టవ్ మీద ఓ పాన్ పెట్టి అందులో ఒకటిన్నర గ్లాసు నీళ్లు పోసి అందులో రెండు స్పూన్ల బెల్లం, 1 స్పూన్ నెయ్యి వేసి నీళ్లు బాగా మరిగిన తర్వాత మంట తగ్గించి ఇందులో 1 గ్లాసు బియ్యం పిండి వేసి ఉండలు లేకుండా దగ్గరపడేవరకు కలిపి స్టవ్ ఆఫ్ చేసి చల్లారనివ్వాలి. -చల్లారిన తర్వాత దానిని చపాతి పిండి కలిపినట్లు కలుపుకోవాలి. -తర్వాత చేతికి ఆయిల్ తీసుకొని కొంచెం కొంచెంగా పిండి తీసుకొని తాళికలుగా(పొడవుగా తీగలా) చేసుకోండి. -తర్వాత స్టవ్ మీద పాన్ లో మూడు గ్లాసుల పాలు పోసి బాగా కాగిన తర్వాత అందులో నానబెట్టిన సగ్గుబియ్యం వేసి ఉడికించుకోవాలి. సగ్గుబియ్యం పైకి తేలితే ఉడికినట్లే. -తర్వాత అందులో తాళికలు వేసేయాలి. అసలు కలపకూడదని గుర్తుంచుకోండి. మంటలను సిమ్ లో పెట్టి 7-8 నిమిషాలు ఉడికించుకోవాలి. -ఈలోగా ఓ బౌల్ లో 1 స్పూన్ల బియ్యం పిండి, కొంచెం పాలు పోసి ఉండలు లేకుండా కలిపి ఈ మెత్తాన్ని స్టవ్ మీద ఉన్న తాళికలలో కొంచెం కొంచెంగా వేసుకోండి. 2 నిమిషాలు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. -2 నిమిషాల తర్వాత అందులో ముందుగా రెడీ చేసిన బెల్లం పాకం వేసి కలపండి. తర్వాత ఇందులో వేయించిన జీడిపప్పు, కిస్మిస్ వేసి కలపండి. అంతే పాలతాళికలు రెడీ.



## శివుడికి అత్యంత ఇష్టమైన రెసిపి

శివుడు ఆగ్న లేనిదే చీమ కూడ కదలదు అంటారు. సకల చరాచర జగత్తుకు లయకారకుడు ఆ పరమేశ్వరుడు లింగోద్భవం చెందిన పవిత్ర దినమే మహాశివరాత్రి. యావత్ సృష్టిని నడిపించే ఆ శంభుడే మాఘ మాసం బహుళ చతుర్ధశి రోజు అనంత భక్త కోటి కోసం శివలింగంగా ఆవిర్భవించిన దినం కావడంతో మహాశివరాత్రిగా పరిగణిస్తారు. ఈ ఏడాది మహాశివరాత్రిని ఫిబ్రవరి 26న జరుపుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ రోజు శివుడు, పార్వతిదేవికి దేవాలయాలు,ఇళ్లలో నైవేద్యాలు సమర్పిస్తారు, దీనిలో తాండైని ప్రత్యేక ప్రసాదంగా సమర్పిస్తారు. మీరు కూడా ఈ మహాశివరాత్రికి మీ ఇంట్లో శివుడికి అత్యంత ఇష్టమైన తండైని తయారు చేయాలనుకుంటే ఎలా చేయాలో ఇక్కడ చూడండి.

తాండై తయారీకి కావాల్సిన పదార్థాలు -అరకప్పు బాదంపప్పు -2 టేబుల్ స్పూన్లు గసగసాలు -2 టేబుల్ స్పూన్లు పుచ్చకాయ గింజలు -2 టేబుల్ స్పూన్లు సోంపు గింజలు -8-10 నల్ల మిరియాలు -6-8 ఏలకులు -10-12 కుంకుమపువ్వు రేకులు -2 టేబుల్ స్పూన్లు రోజ్ వాటర్ లేదా ఎండిన గులాబీ రేకులు - అర కప్పు చక్కెర -1 లీటరు పాలు -అరకప్పు కప్పు చల్లటి నీరు -8-10 జీడిపప్పు,పిస్తాపప్పులు తాండై తయారీవిధానం -ముందుగా బాదం, గసగసాలు, బాదం, సోంపు, నల్ల మిరియాలు, ఏలకులను నీటిలో 4-5 గంటలు నానబెట్టండి. -తర్వాత వీటిని మిక్సీలో వేసి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేయాలి. -ఈ పేస్ట్‌ను ఒక పెద్ద పాత్రలో పోసి ఇందులో చల్లటి నీరు పోసి బాగా ఫిల్టర్ చేయండి. -ఇప్పుడు అందులో పాలు, చక్కెర, రోజ్ వాటర్ కలపండి. పైన కుంకుమపువ్వు వేసి తాండై 1-2 గంటలు ఫ్రిజ్‌లో చల్లబరచండి. -గ్లాసులో తాండై పోసి..తరిగిన జీడిపప్పు, పిస్తాపప్పులతో అలంకరించి సర్వ్ చేయాలి. -ఈ మహాశివరాత్రిక మహాదేవునికి ఇష్టమైన ప్రసాదం తాండైని తయారు చేసి దానిని ఈశ్వరుడికి సమర్పించి,తర్వాత ప్రసాదంగా మీరు స్వీకరించండి.

# సినిమా న్యూస్



# హ్యాపీ వెడ్డింగ్ యానివర్సరీ.. ప్రేమ, పెళ్లి బంధానికి 33 ఏళ్లు!



టాలీవుడ్‌లోని ఎవర్ గ్రీన్ అండ్ మోస్ట్ బ్యూటిఫుల్ కపుల్స్ అనగానే మనకు టక్కున గుర్తొచ్చే పేరు అక్కినేని నాగార్జున, అమల. 1992 జూన్ 11న వివాహ బంధంతో ఒకటైన ఈ జంట.. నేటితో విజయవంతంగా 34వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ ప్రత్యేకమైన రోజున అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఈ 'కింగ్ అండ్ క్వీన్'కు హార్దికల్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వీరి క్యూట్ లవ్ స్టోరీ నెట్టింట వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.

రీళ్లపై మొదలైన రియల్ ప్రేమ కథ: నాగార్జున, అమల కాంబినేషన్‌కు అప్పట్లో వెండితెరపై విపరీతమైన క్రేజ్ ఉండేది. "స్వాతి ముత్యపు జల్లులలో" అంటూ 'ప్రేమ యుద్ధం' చేశారు, "హలో గురూ ప్రేమకోసమేరో ఈ జీవితం" అంటూ డ్యుయెట్లు పాడుకున్నారు. ఇక అలా సినిమాల్లో కలిసి నటిస్తున్న సమయంలోనే వీరిద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. అయితే అందరికంటే ముందుగా నాగార్జునగారే అమలగారి ప్రేమలో పడ్డారట. అమల కన్నీళ్లతో కింగ్ హృదయం గెలిచింది:

ఒకరోజు సినిమా సెట్‌లో జరిగిన చిన్న సంఘటన వీరిద్దరిని దగ్గర చేసింది. ఆ రోజు అమలగారు షూటింగ్ రాలేదట, బాధపడుతూ క్యారవాన్‌లో వున్నారట, అది చూసిన నాగార్జున లోపలికి వెళ్లి కారణం అడగ్గా.. ఆ సీన్‌లో తను వేసుకున్న బట్టలు కంఫర్ట్‌గా లేవని చెప్పారట. ఇక వెంటనే నాగ్ స్పందిస్తూ.. "నువ్వు బాధపడకు, నేనే స్వయంగా డైరెక్టర్‌తో మాట్లాడి డ్రెస్ మారుస్తాను" అని అండగా నిలిచారు. నాగార్జునగారి ఆ మంచితనమే అమలగారి మనసును గెలుచుకుంది.

అమెరికా ట్రిప్‌లో అకస్మాత్తుగా ప్రపోజల్: ఇక ఫ్రెండ్స్ నుండి లవర్స్‌గా మారిన వీరు.. ఒకరోజు కలిసి అమెరికా ట్రిప్‌కు వెళ్లారు. అక్కడే నాగార్జునగారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా అమలగారికి పెళ్లి ప్రపోజల్ పెట్టారు. దీని గురించి అమలగారు ఒక ఇంటర్వ్యూలో చెప్తూ.. "ఆయన చాలా అకస్మాత్తుగా ప్రపోజ్ చేశారు. నేను ఎగ్జైట్‌మెంట్‌లోనే.. మనం హైదరాబాద్ షిఫ్ట్ అయిపోతామా? నేను పెళ్లి తర్వాత కూడా వర్క్ చేయవచ్చా? అని అడిగాను. దానికి ఆయన నువ్వు నీకు నచ్చింది చేయొచ్చు అని చెప్పారు" అంటూ ఆ మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.

చెన్నైలో సింపుల్‌గా పెళ్లి.. అఖిల్ ఎంట్రీ: అమెరికాలో అంత గ్రాండ్‌గా ప్రపోజ్ చేసిన నాగార్జున, పెళ్లి మాత్రం చాలా సింపుల్‌గా ప్లాన్ చేశారు. 1992 జూన్ 11న చెన్నైలో అత్యంత ఆప్తుల మధ్య వీరి వివాహం చాలా సాదాసీదాగా జరిగింది. ఇక ఇద్దరూ కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకోవడంతో అప్పట్లో ఇదొక హాట్ టాపిక్. ఇక పెళ్లయిన రెండేళ్ల తర్వాత వీరికి అఖిల్ అక్కినేని జన్మించారు. నేటికీ ఒకరినొకరు గౌరవించుకుంటూ ఆదర్శ దంపతులుగా సాగిపోతున్నారు. స్క్రీన్‌పై డ్యుయెట్స్ పాడుకున్న ఈ ప్రేమపక్షులు.. నిజ జీవితంలో పెళ్లి చేసుకోవాలనే 'నిర్ణయం' తీసుకుని నేటికి 34 ఏళ్లు పూర్తయ్యాయి. కాలం మారినా వీరిద్దరి మధ్య ప్రేమ, అనుబంధం మాత్రం మారలేదు. అందుకే అభిమానులంతా ఈ జంటను చూసి మురిసిపోతూ పండుగ చేసుకుంటున్నారు. ఎందరికో ఇన్స్పిరేషన్‌గా నిలుస్తున్న నాగార్జున, అమలగారు ఇలాగే ఎప్పటికీ సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

# ఐస్ బ్లూ డ్రెస్ లో మృణాల్ కొత్త లుక్.. ఫ్యాషన్ సెన్స్ కి కేరాఫ్ అడ్రస్!



హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సీతారామం. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాగూర్. సీతా మహాలక్ష్మి పాత్రలో చీరకట్టులో సాంప్రదాయంగా కనిపించి తన అద్భుతమైన నటనతో అందరిని మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా సీత పాత్రలో మృణాల్ ఒదిగిపోయింది. ఈమె నటనకు అభిమానులు మంత్రముగ్దులు కాగా విమర్శకులు ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ఈ సినిమా అప్పట్లో కలెక్షన్ వర్షం కురిపించి.. దుల్కర్ కు హీరోగా తెలుగులో ఒక స్థానాన్ని కల్పించింది. హీరోయిన్గా తెలుగు ప్రేక్షకుల హృదయాలను సొంతం చేసుకున్న మృణాల్.. ఈ సినిమా తర్వాత శౌర్యువ్ (తొలి పరిచయం) దర్శకత్వంలో నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో జ్యోత్స్న పాత్రతో మరోసారి అభిమానుల హృదయాలను దోచుకుంది. ఈ సినిమా తర్వాత ఈమె చేసిన ది ఫ్యామిలీ స్టార్ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ఇక ఈ సినిమా డిజాస్టర్ కావడంతో కొంతకాలం టాలీవుడ్ కి దూరమైన ఈమెకు తెలుగులో అవకాశాలు లభించడం కష్టమే అనే కామెంట్లు వినిపిస్తున్న సమయంలో సడన్గా అడివి శేష్ డెకాయిట్ మూవీ నుండి శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ స్థానం ఈమెకు లభించింది.అలా వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకున్న ఈమె.. ఈ సినిమాలో సరస్వతి, జూలియట్ పాత్రలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా ఈ సినిమాలో జూలియట్ పాత్రకు మంచి మార్కులే పడ్డాయి. ఇక ఇటు బాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది. అందులో భాగంగానే వరుణ్ ధావన్, పూజా హెగ్డే లతో కలిసి హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటించింది. జూన్ 5వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అటు ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా పలు ఇంటర్వ్యూలకు హాజరవుతూ సందడి చేస్తున్న మృణాల్ లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా ఐస్ బ్లూ కలర్ వెస్ట్రన్ వేర్ ధరించి ఆకట్టుకుంది.

# ట్రెండీ అవుట్‌ఫిట్‌లో జియా.. గ్లామర్ ఓవర్ లోడెడ్!




తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ జియా శంకర్. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. షుగర్ అండ్ స్పైస్ అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్, షేర్ చేసిన ట్రెండీ లుక్ ఇప్పుడు కుర్రకారు గుండెల్లో మంటలు పుట్టిస్తూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం..

అదిరిపోయిన జియా శంకర్ లేటెస్ట్ లుక్: జియా శంకర్ తన తాజా ఫోటోషూట్ కోసం ఎంచుకున్న కలర్ ఫుల్ కాంబినేషన్ అదిరిపోయింది. ఆమె త్రీ-పీస్ కో-ఆర్డ్ సెట్ ధరించి ఎంతో స్టైలిష్గా, హాట్‌గా కనిపిస్తోంది. ఇక లైట్ ఎల్లో కలర్ క్రాప్ టాప్, దానికి కాంబినేషన్‌గా ఆలివ్ గ్రీన్ కలర్ హై-వైస్టెడ్ మినీ వ్రాప్ స్కర్ట్ వేసుకుంది. దీనిపై సాఫ్ట్ పింక్ కలర్ లాంగ్ స్లీవ్ కార్డిగాన్ ధరించి, తన గ్లామర్‌తో అందరినీ కట్టిపడేస్తోంది. ఇక ఈ వెస్ట్రన్ లుక్‌లో జియా చార్మింగ్ అండ్ కాన్ఫిడెంట్ లుక్స్ నెటిజన్లకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. జియా శంకర్ తన నటన ప్రయాణాన్ని మన టాలీవుడ్ నుంచే మొదలుపెట్టింది. 2013లో వచ్చిన 'ఎంత అందంగా ఉన్నావే' అనే తెలుగు సినిమాతో ఆమె వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత 2018లో వచ్చిన 'హైదరాబాద్ లవ్ స్టోరీ' అనే రొమాంటిక్ కామెడీ సినిమాలోనూ నటించి మెప్పించింది. ఇక ఆ తర్వాత హిందీ టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టి 'మేరి హానికారక్ బీవీ', 'కాటేలాల్ అండ్ సన్స్' వంటి సీరియల్స్‌తో దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది.

బిగ్ బాస్ మరియు మరాఠీ బ్లాక్‌బస్టర్: ఇక కేవలం నటిగానే కాకుండా రియాలిటీ షోస్ ద్వారా కూడా జియా బాగా పాపులర్ అయింది. హిందీ 'బిగ్ బాస్ ఓటీటీ 2' లో కంటెస్టెంట్‌గా పాల్గొని తన బోల్డ్ అండ్ క్యూట్ ఆటతీరుతో మిలియన్ల కొద్దీ అభిమానులను సంపాదించుకుంది. ఇక 2022లో రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా జంటగా నటించిన మరాఠీ బ్లాక్‌బస్టర్ మూవీ 'వేద్' సినిమాతో మరాఠీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో ఆమె చేసిన నటనకు విమర్శకుల నుండి సైతం ప్రశంసలు దక్కాయి.

# లేస్ డ్రెస్‌లో దివి మ్యాజిక్... ఫోటోలు వైరల్!



తెలుగు టాప్ రియాలిటీ షో 'బిగ్ బాస్' ద్వారా ప్రేక్షకుల మనసు దోచుకున్న అందాల భామ దివి వాద్య. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు ఇప్పుడు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. డస్టీ పింక్ కలర్ లేస్ డ్రెస్‌లో దివి ఇచ్చిన హాట్ అండ్ క్యూట్‌పోజులు అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. "కేవలం నీ గురించే ఆలోచిస్తున్నా!" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. దివి వాద్య తాజా ఫోటోషూట్‌లో సరికొత్త లుక్‌తో మెరిసిపోయింది. దట్టమైన పచ్చని చెట్ల మధ్య, ప్రకృతి ఒడిలో ఆమె దిగిన క్లోజప్ పోర్ట్రెయిట్ ఫోటోలు అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆమె సాఫ్ట్ అండ్ ఇంటెన్స్ కంటిచూపు, ఆ గ్లామరస్ ఎక్స్‌ప్రెషన్స్ చూసేవారిని మంత్రముగ్దులను చేస్తున్నాయి. ఇక ఈ ఫోటోల్లో దివి కాన్ఫిడెన్స్, నేచురల్ బ్యూటీ స్పష్టంగా కనిపిస్తూ నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma